సాక్షి కర్నూలు

మంగళవారం : 28 : మే : 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి సోమవారం బనగానపల్లెకు చెందిన గాజుల లక్ష్మీదేవి కుటుంబం రూ.1,00,016 విరాళాన్ని ఏఈవో ఫణిధరప్రసాద్‌కు అందజేశారు.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం శాస్త్రోక్తంగా సహస్ర దీపార్చన సేవ చేపట్టారు. స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై సోమవారం కడపకు చెందిన నటరాజ డ్యాన్స్ అకాడమీ వారి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

1 నుంచి 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు ఆదోనిలో ఒకటి, కర్నూలులో రెండు, ఎమ్మిగనూరులో ఒకటి, పత్తికొండలో ఒకటి చొప్పున మొత్తం ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 930, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 1,265 మంది హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ అయిన వారికి జూన్ 10న కర్నూలు బీక్యాంపు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పరీక్ష నిర్వహించనున్నారు.

కొనసాగుతున్న సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జరిగినఫస్ట్ ఇయర్ పరీక్షలకు 10,601 మంది విద్యార్థులకుగాను 10,182 మంది హాజరు కాగా 414 మంది గైర్హాజరయ్యారు. సెకండ్ ఇయర్ పరీక్షలకు 3,218 మందికిగాను 3049 మంది హాజరుకాగా 169 మంది గైర్హాజరైయినట్లు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి గురువయ్య శెట్టి తెలిపారు.

- పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 2,107 మంది విద్యార్థులకుగాను 1,132 మంది విద్యార్థులు హాజరు కాగా 975 మంది గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ కె.శామ్యూల్ తెలిపారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

కర్నూలు(అర్బన్): గ్రూప్-2 (మెయిన్స్) పరీక్షలకు స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.వెంకటలక్షుమ్మ తెలిపారు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులు తమ దరఖాస్తులను బీసీ స్టడీ సర్కిల్‌కు స్వయంగా లేదా పోస్టు ద్వారా జూన్ 3వ తేదిలోగా అందించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కర్నూలులోని బీసీ స్టడీ సర్కిల్‌లో 60 రోజుల పాటు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణా కాలంలో ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణా కాలం పూర్తయి న అనంతరం అర్హులైన అభ్యర్థులకు స్టయిఫండ్ మంజూరవుతుందన్నారు. వివరాలకు 08518-236076 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

14 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు 14 మండలాల్లో వర్షం కురిసింది. ఎమ్మిగనూరులో 30.6, ఆదోనిలో 28.6, గోనెగండ్లలో 22.6, మంత్రాలయంలో 20.8, నందవరంలో 14.2, కోసిగిలో 13.4, పెద్ద కడబూరులో 8.4, ఆలూరులో 8.4, దేవనకొండలో 6.2, కౌతాళంలో 4.8, హోలగుంద్లలో 4.2 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ ఉండగా 103.7 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతంతో పోలిస్తే మే నెలలో 27 రోజుల్లో 159 మి.మీ అధికంగా నమోదు కావడం విశేషం.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- జూన్ 4న తేలనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు
- రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ కోసం పకడ్బందీ ఏర్పాట్లు
- ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి అసెంబ్లీకి 14, పార్లమెంట్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు
- అత్యధికంగా 29 రౌండ్లలో పాణ్యం, అత్యల్పంగా 17 రౌండ్ల మంత్రాలయం ఫలితం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ మేరకు జూన్ 4వ తేదీన ఉదయం 8 నుంచి కౌంటింగ్ మొదలు కానున్నది. ఈక్రమంలో జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్లు ఏర్పాటు చేశారు. బారికేడ్ల నిర్మాణం పూర్తయ్యింది. మిగతా ఏర్పాట్లు ఈ నెలాఖరులోపు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు.



కౌంటింగ్ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు, ఒక పార్లమెంట్ స్థానానికి ఈ నెల 13న పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈవీఎంలను రా యలసీమ యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. అక్కడే కౌంటింగ్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. జిల్లాలోని కర్నూలు, పాణ్యం, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. అలాగే ఆయా నియోజకవర్గాల్లో ఎంపీ ఓట్ల లెక్కింపునకు మరో 14 టేబుళ్లు కూడా ఉంటాయి. మొత్తంగా పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు కలిపి 224 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొదట 8 నుంచి 8.30 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్లను, అనంతరం ఈవీఎంలలో ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్‌తో పాటు ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు, ఒక మైక్రోఅబ్జర్వర్ ఉంటారు. మొత్తంగా ఒక టేబుల్‌కు నలుగురు ఉద్యోగులు ఉండి ఓట్ల లెక్కింపు చేపడతారు.

1,174 మంది సిబ్బంది

కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరించి కౌంటింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టనున్నారు. 224 టేబుళ్లకు ఒక్కోదానికి నలుగురు చొప్పున, అలాగే ఇతర విధుల కోసం మొత్తం 1,174 మంది ఉద్యోగులను కౌంటింగ్ కోసం ఎంపిక చేశారు. వీరికి కౌంటింగ్ విధులపై రెండు విడతలుగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. ఇప్పటికే



పోలీసులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, చిత్రంలో ఎస్పీ కృష్ణకాంత్

మొదటి విడతను మే 24వ తేదీన పూర్తి చేశారు. రెండో విడత శిక్షణను మే 31వ తేదీన ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

మొదటి ఫలితం మంత్రాలయం

జూన్ 4న చేపట్టబోయే కౌంటింగ్‌లో మొదటి ఫలితం మంత్రాలయం నియోజకవర్గానికి సంబంధించి వెలువడనుంది. ఇక్కడ మొత్తం 14 టేబుళ్లలో 17 రౌండ్లలో ఫలితాలను వెల్లడిస్తారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లలో 26 రౌండ్లలో ఫలితాలను వెల్లడించాల్సి ఉంటుంది. ఫలితంగా అన్ని నియోజకవర్గాల కంటే ఆఖరుగా పాణ్యం విజేత ఖరారు అవుతారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల ఫలితాలు 19 రౌండ్లలో, కోడుమూరు, ఎమ్మిగనూరు 20 రౌండ్లలో, ఆలూరు ఫలితం 21 రౌండ్లలో తేలనుంది.

ఏజెంట్ల నియామకం కోసం హడావుడి

కౌంటింగ్‌కు సమయం దగ్గర పడుతుండడంతో ఏర్పాట్లపై అధికారులు వేగం పెంచారు. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఏజెంట్ల నియామకానికి మే 30లోపు దరఖాస్తులు ఇవ్వాలని ఆదేశించారు. ఈ క్రమంలో పోటీలో ఉండే అభ్యర్థులు ఏజెంట్ల నియామకంపై దృష్టి సారించారు. కేసులు లేని వారిని వెతికే పనిలో ఉన్నారు. అదే సమయంలో నమ్మకస్తులై ఉండాలని, పార్టీకి, అభ్యర్థికి విధేయుడుగా ఉండే వారిని నియమించాలనే చూస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

ఎన్నికలు ముగియగానే ఈవీఎంలను పోలింగ్ కేంద్రాల నుంచి అత్యంత భద్రత నడుమ జీపీఎస్‌తో అనుసంధానమైన వాహనాల్లో రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్ల నుంచి మూడంచెల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరచారు. వీటిని ప్రతినిత్యం జిల్లా ఎన్నికల అధికారి, ఎస్పీ పర్యవేక్షణ చేస్తున్నారు. తుది పోలింగ్ వివరాల ప్రకారం కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గంలో 76.80 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే జిల్లాలోని కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 76.42 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019 ఎన్నికలతో పోల్చుకుంటే నమోదైన ఓటింగ్ శాతం అసెంబ్లీల్లో స్వల్పంగా పెరగగా..పార్లమెంట్‌లో స్వల్పంగా తగ్గింది.

పక్కాగా ఏర్పాట్లు

రాయలసీమ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ బ్లాక్, లైఫ్ సైన్సెస్, లైబ్రరీ విభాగాల్లో నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేశారు. ఇందులో పోస్టల్ బ్యాలెట్ కోసం ప్రత్యేక టేబుళ్లు, ఈవీఎంల లెక్కింపు, వీవీప్యాట్ల లెక్కింపు కోసం ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో సిబ్బందిని, ఏజెంట్లను వేరు చేసేలా ప్రత్యేక బారికేడ్లను నిర్మించారు. సిబ్బందితో సంతకాలు తీసుకోవడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. వీవీ ప్యాట్ల లెక్కింపు కోసం ప్రత్యేక వీవీ ప్యాట్ కౌంట్ బూత్‌లు ఉన్నాయి. ఏజెంట్లను పరిశీలించి కౌంటింగ్ కేంద్రాల్లోకి పంపేందుకు ప్రతి నియోజవకర్గంలో ఏజెంట్ ఐడెంటిఫై కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియమితులైన ఏజెంట్లు ఫామ్-18 లెటర్, గుర్తింపు కార్డు, డిక్లరేషన్ ఫామ్ ఇస్తేనే వారిని లోపలికి పంపుతారు. కౌంటింగ్ కేంద్రాల్లో సిబ్బంది, ఏజెంట్లు సెల్‌ఫోన్లను తీసుకెళ్లకుండా నిషేధం విధించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు ప్రత్యేకంగా ఫుడ్ సెంటర్లను కూడా ఏర్పాటు చేశారు. ఆడిటోరియంలో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేశారు. నెలాఖరులోపు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ఉన్నారు. వర్సిటీలోని బాయ్స్ హాస్టల్ వెనుక నుంచి సిబ్బంది, ఏజెంట్లు, క్యాండిడెట్లను కౌంటింగ్ కేంద్రాలను అనుమతిస్తారు. అలాగే అబ్జర్వర్లు, ఆర్వోలు, ఇతర ఎన్నికల ఉన్నతాధికారులను మెయిన్ గేటు వెంబడి లోపలికి అనుమతిస్తారు.

ఏర్పాట్ల పరిశీలన

రాయలసీమ యూనివర్సిటీలో కౌంటింగ్ ఏర్పాట్లను సోమవారం ఎస్పీ జి.కృష్ణకాంత్‌తో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల లైవ్ ఫీడింగ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌంటింగ్ రోజు ఎక్కువ సమయం పడితే ఇబ్బంది లేకుండా వర్సిటీలో అదనపు లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ మెటీరియల్‌ను ఆర్వోలకు అందజేసినట్లు డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. మొబైల్ డిపాజిట్ సెంటర్, ఫుడ్ కౌంటర్, తాగునీరు, ఏజెంట్ ఐడెంటిఫికేషన్ కౌంటర్ల ఏర్పాట్లు ఎంత వరకు వచ్చాయని కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగబాబు, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఇరిగేషన్ ఎస్‌ఈ రెడ్డి శేఖరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు పాల్గొన్నారు.

ఆశల విత్తు ఆరంభం



కలపరి గ్రామ సమీపంలోని పొలంలో పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

ఆస్పరి: ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుని విత్తనాలు నాటుతున్నారు. ఆస్పరి మండలంలో హలిగేర, యాటకల్లు, తొగలుగల్లు, కలపరి, దొడగొండ, బైలుపత్తికొండ, ములుగుందం, కారుమంచి, కైరుప్పల, గార్లపెంట, డీకోటకొండ తదితర గ్రామాల్లో విత్తన పనులు జోరుగా సాగుతున్నాయి. ఎర్ర నేలల్లో పత్తి, వేరుశనగ, కొర్ర, సజ్జ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఈసారి ముందస్తుగా వర్షాలు కురుస్తుండడంతో విత్తన పనుల్లో రైతులు బిజీ అయ్యారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు

- తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌కు పంపుతున్న విద్యాశాఖ
- ఓటీపీ ఆధారిత సురక్షితమైన పద్ధతిలో సమాచారం బట్వాడా

కర్నూలు సిటీ: విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్‌లో విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు అందిస్తూ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,345 ప్రాథమిక, 902 ప్రాథమికోన్నత, 1,000 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ స్కూళ్లలో 7.25 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ-3, ఎఫ్ఏ-4 పరీక్షలతో పాటు ఎస్ఏ-1, ఎస్ఏ-2 పరీక్షల్లో వచ్చిన మార్కులు, వచ్చిన గ్రేడ్‌లు, విద్యా సంవత్సరంలో నెలలో పనిదినాలు, స్కూల్‌కి హాజరైన రోజులు.. సంబంధించిన వివరాలతో కూడిన ప్రగతి పత్రాలను (హోలిస్టిక్ రిపోర్ట్ కార్డులను) విద్యాశాఖ నేరుగా తల్లిదండ్రుల రిజిస్టర్ సెల్‌ఫోన్లకు సంక్షిప్త సమాచార రూపంలో చేరవేస్తున్నారు. వీటితో పాటు విద్యార్థి పాఠ్యేతర సబ్జెక్టుల్లో చూపిన ప్రతిభతో కూడిన ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు పంపించే విధానాన్ని మొట్ట మొదటిసారి అమల్లోకి తెచ్చారు. 1 నుంచి 9వ తరగతి చదివిన విద్యార్థుల పూర్తి వివరాలు ప్రోగ్రెస్ కార్డుల్లో ఉంటాయి. విద్యార్థి పేరు, తల్లిదండ్రుల వివరాలు, చిరునామా, ఆధార్‌కార్డు నంబరు, స్కూల్‌లో చేరిన సంవత్సరం, పుట్టిన తేదీ, మీడియం, విద్యార్థి ఎత్తు, బరువు, రక్త గ్రూప్ తదితర వివరాలు కార్డుల్లో చేర్చారు.

ఇలా డౌన్‌లోడ్ చేసుకోవాలి

పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలోని స్కూల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా విద్యార్థి తల్లిదండ్రుల రిజిస్టర్ మొబైల్ నంబరుకు డియర్ పేరెంట్ అంటూ ఎస్ఎంఎస్ వస్తుంది. దీనిలో ఇచ్చిన లింక్‌ను ఓపెన్ చేయాలి. ఆ తరువాత స్క్రీన్‌పై కనిపించే అక్షరాలను అక్కడ ఇచ్చిన స్పేస్‌లో టైపు చేయగా, రిజిస్టర్ మొబైల్‌కు ఆరు అంకెల ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేసిన తరువాత హోలిస్టిక్ రిపోర్ట్ కార్డు అని వస్తుంది. దీనిని పీడీఎఫ్ రూపంలో సేవ్ చేసుకోవడం ద్వారా విద్యార్థి ప్రగతికి సంబంధించిన పూర్తి వివరాలను చూసుకోవచ్చు.



సెల్‌ఫోన్‌కు వచ్చిన విద్యార్థి హోలిస్టిక్ రిపోర్ట్ కార్డు డౌన్‌లోడ్ సందేశం

కమనీయం.. పాండురంగడి చక్రస్నానం

కోవెలకుంట్ల: పట్టణంలోని వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో సోమవారం వసంతోత్సవం, స్వామివారి చక్రస్నాన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజున ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు పాండురంగడికి పంచామృతాభిషేకం, భూసూక్త విధానేన అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం స్వామివారి వసంతోత్సవంలో భాగంగా భక్తులు రంగులు చల్లుకున్నారు. వైశాఖ మాసాన్ని పురస్కరించుని 11 రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో కల్యాణం, వాహన సేవలు, రథోత్సవం అనంతరం కోనేటిలో చేపట్టిన చక్రస్నాన కార్యక్రమం కమనీయంగా కొనసాగింది. రాత్రి ధ్వజారోహణ, కంకణ నిమజ్జనం, నాకబలితో ఈ నెల 17వ తేదీన ప్రారంభమైన పాండురంగడి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన కార్యక్రమాలను తిలకించేందుకు పట్టణంతోపాటు చుక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో కోనేటి ప్రాంగణం జనసంద్రమైంది.





స్వామివారి చక్రస్నాన కార్యక్రమాన్ని తిలకిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) ఆలయం ఎదుట కోనేరులో ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

జనరల్ ప్రయాణం.. టికెట్ మరింత సులభం

- యూటీఎస్ యాప్ ద్వారా జనరల్ టికెట్ బుకింగ్
- ఆన్‌లైన్‌లో రోజువారీ టికెట్ల కేటాయింపు
- కాగిత రహిత టికెట్ దిశగా రైల్వే శాఖ అడుగులు
- నంద్యాల సెక్షన్ పరిధిలోని 10 స్టేషన్లలో యూటీఎస్‌పై అవగాహన

నంద్యాల(సిటీ): రైలు జనరల్ బోగిలో ప్రయాణం అంటే మామూలు హడావిడి కాదు. ఇంటి నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకోవడం, లగేజీ, పిల్లలతో వెళ్లడం.. తీరా టికెట్ తీసుకుందామంటే అక్కడ కౌంటర్‌లో చాంతాడంత క్యూ.. రైలు వెళ్లిపో తుందేమోనన్న ఆత్రుత.. ఇకపై ఈ సమస్యలన్నింటికీ చెక్ పెడుతూ.. ఇంట్లో నుంచే జనరల్ టికెట్ బుక్ చేసుకునే అవకాశం రైల్వే శాఖ కల్పించింది. ప్రధానంగా పెద్ద రైల్వేస్టేషన్లలో పండుగలు, సెలవులు, ప్రత్యేక రోజుల్లో రైలు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. టికెట్ కొనుగోళ్లకు కౌంటర్ల వద్ద పెద్ద సంఖ్యలో బారులుదీరుతారు. ఆ సమయంలో ఈ యాప్ ద్వారా జనరల్ టికెట్ కొనుగోలు చేసి దేశంలో ఎక్కడికైనా.. ఏ రైలులోనైనా ప్రయాణించవచ్చు. ప్రయాణికుల ఇక్కట్లను తీర్చేందుకు రైల్వే శాఖ యాప్‌ను అందుబాటు లోకి తీసుకొచ్చింది. యూటీఎస్ (అన్ రిజర్వ్ టికెటింగ్ సిస్టం) ఆన్ మొబైల్ యాప్ సదుపాయాన్ని కల్పించింది. సాధారణ టికెట్‌పై ప్రయాణించాలనుకునే వారు అదే రోజున ఈ యాప్ ద్వారా టికెట్ పొందొచ్చు. నంద్యాల జిల్లాలోని రైల్వే స్టేషన్లలో ఈ యాప్ ద్వారా ప్రయాణికులు సాధారణ, సీజనల్, ప్లాట్ ఫాం టికెట్లు కొనుగోలు చేస్తున్నారు. రైల్వే అధికారులు ఈయాప్ ద్వారా ఎలా టికెట్ తీసుకోవాలో అవగాహన కల్పిస్తున్నారు.

పాటించాల్సిన నిబంధనలు...

- ప్రయాణం చేసే రోజునే టికెట్ బుక్ చేసుకోవాలి.
- టికెట్ బుక్ అయిన గంటలోపే రైలు ఎక్కాలి. రైలులో ప్రయాణిస్తున్నప్పుడు టికెట్ బుక్ కాదు.
- ఫోన్‌లో జీపీఆర్ఎస్ యాక్టివేషన్‌లో ఉండాలి.
- టికెట్ పొందడం, ప్రయాణ సమయంలో సమస్యలు ఉంటే యూటీఎస్ యాప్‌లోని హెల్ప్ కస్టమర్ కేర్ నంబర్లను సంప్రదించవచ్చు.



నంద్యాల రైల్వే స్టేషన్‌లో యువకులకు యాప్ గురించి వివరిస్తున్న దృశ్యం

యాప్‌లో నమోదు...

జీపీఆర్ఎస్ యాక్టివేషన్ ఉన్న స్మార్ట్ ఫోన్, ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉన్నవారు గూగుల్ ప్లే స్టోర్ ద్వారా యూటీఎస్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి. లేదా www.utsonmobile.indianrail.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి యూటీఎస్ యాప్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేసిన తర్వాత ఫోన్ నంబరు, పేరు, పాస్‌వర్డ్, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ నంబరు నమోదు చేసిన వెంటనే వినియోగదారుడి పేరున ఖాతా రిజిస్ట్రేషన్ అవుతుంది.

టికెట్ బుకింగ్...

యూటీఎస్ యాప్ తెరిచి ఫోన్ నంబరు, పాస్‌వర్డ్‌తో తమ ఖాతాలోకి లాగిన్ అవ్వాలి. టికెట్ ఎలా పొందాలో వివరాలున్న తెర కనిపిస్తుంది. ఇందులో సాధారణ బుకింగ్, క్విక్ బుకింగ్, ఫ్లాట్ఫాం బుకింగ్, సీజన్ బుకింగ్, క్యూఆర్ బుకింగ్, క్యాన్సిల్ టికెట్, బుకింగ్ హిస్టరీ, షో టికెట్, ఆర్-వ్యాలెట్, ప్రొఫైల్, హెల్ప్ వంటి వివరాలు కనిపిస్తాయి. సాధారణ బుకింగ్, బుక్ అండ్ ట్రావెల్, బుక్ అండ్ ప్రింట్, టికెట్ ఏ స్టేషన్ నుంచి ఏ స్టేషన్ వరకు వివరాలు ఉంటాయి. టికెట్ బుకింగ్ కోసం సాధారణ బుకింగ్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తర్వాత ఎక్కాల్సిన, దిగాల్సిన స్టేషన్ వివరాలు ప్రయాణికుల సంఖ్య నమోదు చేయాలి.



చెల్లింపు ఇలా..

యాప్‌లో గెట్ ఫేర్ ఆప్షన్ ద్వారా టికెట్ ధర తెలుసుకోవాలి. కొనుగోలు నగదు చెల్లింపును ఆర్-వ్యాలెట్, క్రెడిట్, డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, డిజిటల్ పేమెంట్ యాప్‌ల ద్వారా చేపట్టవచ్చు. షో టికెట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే బుక్ చేసిన టికెట్ వివరాలు, వ్యూ టికెట్ ఆప్షన్‌పై క్లిక్ చేస్తే టికెట్ కనిపిస్తాయి. కాగిత రహిత టికెట్ బుక్ చేసుకున్నవారు తమ స్మార్ట్ ఫోన్‌లో టికెట్ డౌన్లోడ్ చేసుకొని ప్రయాణం సమయంలో టీసీకి చూపించాలి. ప్రింటెడ్ టికెట్ ఆప్షన్ ఎంచుకున్నవారు రైల్వేస్టేషన్‌లోని ఏటీవీఎం, కో-టీవీఎం ఓసీఆర్ యంత్రాలు, ఓటీఎస్ బుకింగ్ కౌంటర్లో ఫోన్, బుకింగ్ ఐడీ నంబర్ నమోదు చేసి టికెట్ ప్రింట్ తీసుకోవాలి.

జనరల్ టికెట్ సులభంగా పొందొచ్చు

జనరల్ రైల్ టికెట్‌ను యూటీఎస్ యాప్ ద్వారా సులభంగా పొందవచ్చు. ఇందుకు స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. ప్రతి ఒక్కరూ ఇంట్లో ఉండగానే రైలు టికెట్‌ను బుక్ చేసుకుని ఎంచక్కా రైలు ఎక్కే అవకాశం రైల్వే శాఖ కల్పిస్తుంది. నంద్యాల పరిధిలోని 10 రైల్వే స్టేషన్లలలో ఇదివరకే ఈ యాప్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రతి స్టేషన్‌లో ప్రత్యేక సిబ్బంది సహకారంతో ప్రయాణికులకు సమాచారాన్ని అందిస్తున్నాం. రానున్న కాలంలో క్యూలలో నిల్చునే వారి సంఖ్య తగ్గేలా చేస్తాం.

– షా మహమ్మద్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, నంద్యాల సెక్షన్

క్లుప్తంగా

వేరుశనగకు పెరిగిన డిమాండ్

కర్నూలు(అగ్రికల్చర్): నాలుగైదేళ్లలో ఎప్పుడూ లేని విధంగా ఈసారి వేరుశనగకు డిమాండ్ ఏర్పడింది. ముందస్తు వర్షాల నేపథ్యంలో మిర్చి, మొక్కజొన్న రైతులు కూడా వేరుశనగపై ఆసక్తి చూపుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. వ్యవసాయ శాఖ జిల్లాకు 39,215 క్వింటాళ్ల వేరుశనగ అవసరమని కోరగా.. కేవలం 13,929 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. అన్ని మండలాల్లో వేరుశనగకు డిమాండ్ పెరగడంతో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు అదనంగా 11,150 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ ఇప్పటికే వేరుశనగ సాగు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ఆర్‌బీకేల్లో 4,500 క్వింటాళ్లను రైతులకు అందుబాటులో ఉంచింది. అదనపు వేరుశనగ కోసం ఒత్తిడి వస్తుండటంతో జిల్లా అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. 20 రోజుల క్రితమే జిల్లాకు కనీసం 5వేల క్వింటాళ్లు అదనంగా కేటాయించాలని వ్యవసాయ శాఖకు నివేదించినా ఫలితం లేకపోవడం గమనార్హం. కోడ్ నెపంతో వ్యవసాయ యంత్రాంగం ఏకపక్షంగా విత్తనాలు కేటాయించడమే ఈ సమస్యకు కారణంగా తెలుస్తోంది.

కేజీ హైవే పనుల పరిశీలన


హైవే పనులను పరిశీలిస్తున్న జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు

కర్నూలు(న్యూటౌన్): కర్నూలు– ఆత్మకూరు (కేజీ) హైవే పనులను జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని 13 కిలో మీటర్ల జాతీయ రహదారి పనులు సాగుతున్నాయన్నారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా ఇచ్చిన పరిధికంటే ఎక్కువగా తవ్వారా లేదా అనే దానిని పరిశీలించారన్నారు. ఎక్కడైనా పరిధికి మించి గ్రావెల్ తవ్వితే వాటికి వెంటనే సీనరైజ్ చార్జీలు, ఇతర ట్యాక్సులు చెల్లించాల్సి వస్తుందన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ డీడీతో పాటు జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

‘పది’ పుస్తకంలో దేవరగట్టు పాఠం

- ఈ ఏడాది పదో తరగతి తెలుగు సిలబస్‌లో మార్పులు
- సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పాఠ్యాంశాలు
- రాష్ట్రంలో వివిధ జిల్లాలో సంప్రదాయాలకు ప్రాధాన్యత
- కర్నూలు జిల్లాలో దేవరగట్టు ఉత్సవాల ప్రస్తావన




దేవరగట్టులోని మాలమాల్లేశ్వర ఆలయం, దసరా రోజు జరిగే బన్ని ఉత్సవం(ఫైల్) ,తెలుగు పాఠ్యపుస్తకంలో ప్రస్తావించిన దేవరగట్టు బన్ని ఉత్సవం

కర్నూలు సిటీ: విద్యార్థి భవిష్యత్తుకు పదో తరగతి కీలక దశ. ఈ దశ పూర్తయ్యేసరికి పిల్లలు తెలుగు భాషను నిత్య జీవిత వ్యవహారాల్లో సమర్థవంతంగా వినియోగించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. ఈ ఏడాది (2024–25) పదో తరగతి తెలుగు సిలబస్‌లో మార్పులు చేసింది. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా పాఠ్యాంశాలు రూపొందించింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇచ్చింది. ఇందులో భాగంగానే కర్నూలు జిల్లాలోని దేవరగట్టు' బన్ని' ఉత్సవం గురించి పాఠ్యాంశంలో ప్రస్తావించారు.

మాతృభాషకు ప్రాధాన్యత

జాతీయ విద్యా ప్రణాళికలో భాగంగా మాతృభాషకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. భాషాధ్యయనం ద్వారా నైతిక విలువలు, శీలనిర్మాణం జరిగేలా పాఠ్యాంశాలు రూపకల్పన చేశారు. దేశ భక్తి, తల్లిదండ్రుల సేవ, కుటుంబ విలువలు, ప్రకృతి–పర్యావరణ స్పృహ, ఆధునిక విద్య– ఆవశ్యకత, స్త్రీ ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు మొదలైన ఇతివృత్తాల ఆధారంగా పాఠ్యంశాలను ఎంపిక చేశారు. పాఠ్యంశం చివరిలోని అంశాలను విద్యార్థులను ఆలోచింప చేయడంతో పాటు, సృజనాత్మక శక్తిని, విశ్లేషణాత్మక ధోరణిని పెంపొందించేలా ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రతి పాఠ్యంశం చివరిలో మీకు తెలుసా? లోని అంశాలు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా తెలుగు పరిమళం (తెలుగు వాచకం)లో పొందుపరిచారు.

బన్ని ఉత్సవ ప్రస్తావనపై హర్షం

పదో తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో దేవరగట్టు బన్ని ఉత్సవం గురించి ప్రస్తావించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన ప్రభుత్వానికి కర్నూలు జిల్లా వాసులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. కర్నూలు జిల్లాలోని హొళగుంద మండలంలో దేవరగట్టు 'బన్ని' ఉత్సవం ప్రసిద్ధి. త్రేతాయుగంలో మణి చూడాద్రి(ఇప్పుడు దేవరగట్టు) అను పేరు గల పవిత్ర ప్రాంతంలో మునులు నివాసం ఉండేవారు. మణి, మల్లాసురుడు అనే రాక్షసులు కూడా అక్కడే ఉంటూ వారి జీవనానికి భంగం కలిగించే వారు. రాక్షసుల బాధలు భరించలేక మునులు శివున్ని ఆశ్రయించారు. శివుడు అనుగ్రహించి రాక్షస సంహారానికి పూనుకున్నాడు. అసురులు అహంకాన్ని తొలగించుకొని శివున్ని ఈ పర్వతంపై వెలసి భక్తులను అనుగ్రహించమని కోరగా పార్వతీపరమేశ్వరులు మాత మాళమ్మ, మల్లేశ్వరులుగా కుర్మావతారంలో కొండపై వెలిశారు. ప్రతి ఏటా దసరా రోజు అక్కడ జరిగే ఉత్సవానికి 'బన్ని' ఉత్సవం అని పేరు. స్వామివారి కళ్యాణం అనంతరం జరిగే ఉత్సవ విగ్రహ ఊరేగింపు సమయంలో వచ్చే పరిసర గ్రామ ప్రజలు చేతిలో దివిటీలు, కర్రలు పట్టుకొని కొండల్లో డోలు వాయిస్తూ 'డీర్....గోపరాక్....బహూపరాక్' అనే శబ్దాలు చేస్తూ కొండకు చేరుకొని ఊరేగింపులోని దేవుని విగ్రహాలను చేతిలోని కర్రలతో తాకాలని ప్రయత్నిస్తారు. కాలక్రమేణ అది ఒక సంప్రదాయంగా తరువాత సమరంగా మారింది. విగ్రహాలు రక్షాస్థలికి చేరాక ఆ సమయంలో బసవన్న గుడి వద్ద ఆలయ ప్రధాన అర్చకులు భవిష్యవాణి వినిపిస్తారు. వసంతోత్సవం నాడు గొరవయ్యలు ఇనుప గొలుసును తెంపడం విశేషం. దసరా వచ్చిందంటే తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా లక్షలాది మంది భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

మల్లన్న సేవలో మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం వేకువజామున ఆలయం వద్దకు చేరుకుని మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అలాగే మాజీ రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్ కూడా మల్లన్నను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

ఇసుక అక్రమ తరలింపుపై దాడులు

కర్నూలు (న్యూటౌన్): ఇసుక అక్రమ తరలింపుపై సెబ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. ఒకరిపై కేసు నమోదు చేసి నాలుగు టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఒక ట్రాక్టర్‌ను జప్తు చేసి రూ.10వేలు అపరాధ రుసుం ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. అలాగే కర్నూలు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ల పరిధిలో సుంకం చెల్లించని అక్రమ మద్యంపై 7 కేసులు నమోదు చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 1134 మద్యం బాటిళ్లను, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 1500 లీటర్ల నాటుసారా తయారీకి ఉపయోగించిన బెల్లంఊటను ధ్వంసం చేశారు.

కామాంధుడికి జీవితఖైదు

- రూ.20వేల జరిమానా


ముద్దాయిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

కర్నూలు(లీగల్): ఏడేళ్ల చిన్నారిపై అమానుషంగా ప్రవర్తించిన కామాంధుడికి కర్నూలు జిల్లా పోక్సో కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం జీవితఖైదు విధిస్తూ సోమవారం తీర్పు చెప్పింది. హొళగుంద పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీజీహళ్లి గ్రామానికి చెందిన రంగముని అదే గ్రామానికి చెందిన ఏడేళ్ల చిన్నారిని 2021 ఆగస్టు 13వ తేదీ ఉదయం 10.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో అక్రమంగా ప్రవేశించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించి వెళ్లిపోయాడు. పొలం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు బాలిక వాంతులు చేసుకుని అనారోగ్యంగా ఉండడం చూసి ఆరా తీయగా జరిగిన ఘటన బాలిక తెలియపర్చింది. అదే రోజు రాత్రి బాలిక తల్లి హొళగుంద పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గిరిబాబు కేసు నమోదు చేశారు. అప్పటి ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్‌కు సమాచారం ఇవ్వగా కేసును విచారించి పోక్సో చట్టం కింద నిందితుడు రంగమునిపై అభియోగ పత్రాలు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో రంగమునికి జీవిత ఖైదీ, రూ.20వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జి భూపాల్‌రెడ్డి తీర్పు చెప్పారు. ముద్దాయి చెల్లించే జరిమానా బాధితులకు చెల్లించాలని, అలాగే ప్రభుత్వం తరఫున బాధిత బాలికకు రూ.2 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని ఆదేశాలిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి వెంకటేశ్వర్‌రెడ్డి వాదించారు.

పెళ్లి పేరుతో మోసం.. నిందితుడి అరెస్ట్


అరెస్ట్ చేసిన నిందితుడిని చూపుతున్న పోలీసులు

దేవనకొండ: పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన తెర్నెకల్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు సోమవారం విలేకరులకు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. మూడు నెల క్రితం పొట్లపాడు గ్రామానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుంటానని చంద్రశేఖర్ మాయమాటలు చెప్పి నమ్మించి మోసం చేసి పారిపోయాడు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టగా కరివేముల–తెర్నెకల్ క్రాస్ రోడ్డులో నిందితుడు కనిపించగా అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. పత్తికొండ కోర్టులో జడ్జి ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు.

గాలివానతోనే విద్యుత్ కోతలు

- విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో అధికారిక విద్యుత్ కోతలు లేవని, గాలివానతోనే కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఆ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మే నెలలో కురిసిన వర్షాలకు, పెనుగాలుల తీవ్రతకు 22 గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయని తెలిపారు. దీంతో ఆయా ప్రాంతాల్లో కొద్ది గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందే తప్ప.. కోతలనేవే లేవని ఆయన స్పష్టం చేశారు. అయితే కొన్ని పత్రికల్లో నిరంతరం విద్యుత్ కోతలంటూ అవాస్తవ కథనాలు వచ్చాయన్నారు. ఉమ్మడి జిల్లాలో 33 కేవీ ఫీడర్లు 34, 11 కేవీ ఫీడర్లు 28 కాలిపోయాయని, 33 కేవీ పోల్స్ 115, 11 కేవీ పోల్స్ 2,093, ఎల్‌టీ పోల్స్ 1,226 కూలిపోయాయని, 33 కేవీ లైన్‌లు 6.78 కిలోమీటర్లు, 11 కేవీ లైన్స్ 125.58 కిలోమీటర్లు దెబ్బతిన్నాయని, 217 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని తెలిపారు. దీంతో విద్యుత్ శాఖకు రూ.10.09 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్నారు. మే నెలకు సంబంధించి రోజువారి విద్యుత్ వినియోగం కోటా 14.56 మిలియన్ యూనిట్లు ఉందని, అయితే 11.17 మిలియన్ యూనిట్లు మాత్రమే వినియోగం ఉందని పేర్కొన్నారు. కోటాలో రోజుకు 3.38 మిలియన్ యూనిట్లు విద్యుత్ మిగులుతోందని, అలాంటపుడు విద్యుత్ కోతలు విధించాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. దెబ్బతిన్న పోల్స్, లైన్‌లను కొద్ది గంటల వ్యవధిలోనే పునరుద్ధరించి విద్యుత్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్‌లో దాదాపు 2.50 లక్షల హెక్టార్లలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, ఇందుకు అవసరమైన బీటీ విత్తన ప్యాకెట్లను సరఫరా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. సోమవారం సాయంత్రం పత్తి విత్తన కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడారు. జిల్లాకు 18 లక్షలకుపైగా ప్యాకెట్లు అవసరమవుతాయని, వ్యవసాయ శాఖ కమిషనరేట్ 19లక్షల ప్యాకెట్లకు ఆయా కంపెనీల సప్లయి ప్లాన్ ఇచ్చిందన్నారు. బీటీ–2 పత్తి విత్తన ప్యాకెట్లకు కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం చేస్తే కంపెనీలపైనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పీ రూ.864 ఉందని, దీనికి ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ఆదోని ఏడీఏ బాలవర్ధిరాజు, ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, ఏవో రాఘవేంద్ర, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్ మృతి


వాసుదేవ రెడ్డి (ఫైల్)

గడివేముల: పెసరవాయి గ్రామానికి చెందిన కేబుల్ ఆపరేటర్ వాసుదేవరెడ్డి (42) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. రెండు రోజులు క్రితం గాలీవానకు గ్రంధివేముల సమీపంలో కేబుల్ వైర్లు తెగిపోయాయి. వాటిని సరిచేసేందుకు సోమవారం స్తంభం పైకి ఎక్కగా ప్రమాదవశాత్తు తీగలు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య స్వాతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ శివరాంరెడ్డి, గ్రామ నాయకులు ఎల్లారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారముల్లో

స్టాఫ్ కావలెను
ప్రముఖ న్యూ క్వాలిటీ టైల్స్ అండ్ సానిటరీ వేర్
మా వివిధ బ్రాంచ్‌లలో పనిచేయుటకు స్టాఫ్ కావలెను. M.B.A. ఫైనాన్స్ చదివిన వారికి ప్రాధాన్యత.
New Quality Tiles & Sanitary Ware
బిషప్ చర్చి ఎదురుగా, నంద్యాల చెక్‌పోస్ట్ దగ్గర, కర్నూలు.
సెల్: 94912 83821, 96188 14378

SHRIRAM Life Insurance
బ్రాంచ్ మేనేజర్లు కావలెను
శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, వారిచే కొత్తగా ప్రారంభించే ఈ క్రింది శాఖలకు అర్జెంటుగా ఆసక్తి గల యువతి, యువకులు కావలెను
కొత్త శాఖలు : డోన్, గుత్తి, మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు, ఆత్మకూర్, వనపర్తి, గద్వాల, కోడుమూరు, డోర్నాల, మార్కాపురం
బ్రాంచ్ మేనేజర్
కనీసం ఏదైనా ఇన్సూరెన్స్ రంగంలో లేదా బ్యాంకింగ్ రంగంలో కానీ 3 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి
Salary : 30,000 to 60,000 **
Age: 25-38, Male and Female with any Degree
Interview's on 28th & 29th May 24
Call : 9966202019, 7780477217

క్రెడిట్ కార్డ్ పంపి బురిడీ

- బ్యాంక్ అకౌంట్ల నుంచి రూ.1.84 లక్షల నగదు మాయం
- లబోదిబోమంటున్న బాధితుడు


డూప్లికేట్ క్రెడిట్ కార్డ్ చూపుతున్న బాధితుడు నూరిల్లా

ఎమ్మిగనూరురూరల్: క్రెడిట్ కార్డు పంపి, ఫోన్ ద్వారా ఓటీపీ తెలుసుకుని బ్యాంక్ అకౌంట్లలో రూ.1.84 లక్షలు నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఈ ఘటన ఎమ్మిగనూరు పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు...పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి నూరిల్లా, ఆయన భార్య రిజ్వానాకు ఈ నెల 17న ఎమ్మిగనూరు బ్రాంచ్ బజాజ్ ఫైనాన్స్ కంపెనీ పేరు నుంచి కొత్త క్రెడిట్ కార్డులు రిజిష్టర్ పోస్టులో వచ్చాయి. అప్పటి నుంచి ఆర్‌బీఎల్ బ్యాంక్ ఐడీ పేరుతో 08800627894 నంబర్ నుంచి కాల్స్ రావడం.. ఓటీపీ చెప్పాలని అడగడంతో నమ్మిన నూరల్లా ఓటీపీ నంబర్ ఇచ్చారు. 17వ తేదీన రూ. 51,445, అలాగే 18వ తేదీన రూ. 51,475, ఆ తరువాత 19వ తేదీన రూ. 32,944 ఆయన బ్యాంక్ అకౌంట్ నుంచి డ్రా చేసుకున్నారు. అలాగే రిజ్వానాకు కాల్ చేసి క్రెడిట్ కార్డు యాక్టివ్ చేస్తామని సెల్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్ తీసుకుని 20వ తేదీన రూ. 48,386 డ్రా చేసుకున్నారు. భార్యాభర్తల అకౌంట్ నుంచి మొత్తం రూ. 1,84,250 సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధితుడు స్థానిక బజాజ్ ఫైనాన్స్ కార్యాలయం వెళ్లి క్రెడిట్‌కార్డులు చూపించడంతో ఇవి తమవి కావని చెప్పారు. వెంటనే నూరిల్లా సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేశారు. బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరుపుతున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

హద్దు మీరితే.. ఆటకట్టిస్తాం

- ఆళ్లగడ్డలో మాబ్ ఆపరేషన్.. మాక్ డ్రిల్


ఆళ్లగడ్డ నాలుగురోడ్ల కూడలిలో గుమికూడిన జనం


ఆందోళనకారులను హెచ్చరిస్తున్న దృశ్యం


ఆందోళనకారులపై తుపాకులు ఎక్కు పెట్టిన దృశ్యం


పోలీస్ కవాతులో పాల్గొన్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఆళ్లగడ్డ: అసలే ఎన్నికల వాతావరణం.. ఓట్ల లెక్కింపు అనంతరం అల్లర్లు జరిగే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో పోలీసులు కార్డెన్ సెర్చ్, అవగాహన సదస్సులు.. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణంలోని నాలుగు సెంటర్లో సోమవారం ఓ వైపు ప్లకార్డులు, ప్లెక్సీలను చేతపట్టుకుని గట్టిగా నినాదాలు చేస్తూ.. కేకలు వేస్తూ కొందరు వ్యక్తులు గుంపుగా నాలుగు రోడ్ల సెంటర్లోకి దూసుకు వస్తున్నారు.. మరోవైపు వారిని ఎదుర్కొనేందకు సిద్ధమైన పోలీసులు.. సంయమనంతో 'వెనక్కి వెళ్లకపోతే కాల్పులు జరుగుతాయని' సీఐ రమేష్‌బాబు మైకులో హెచ్చరికలు.. అంతలోనే తగ్గేతేలేదని యువకులు పోలీసులపై రాళ్లు రువ్వడం.. దీంతో అక్కడే ఉన్న డీఎస్పీ 'ఫైర్' అనడంతో పోలీసులు ఒక్కసారిగా తుపాకులు ఎక్కుపెట్టి కాల్పులు జరిపారు. అక్కడే ఉన్న ఓ వ్యక్తి రక్తం కారుతూ కింద పోవడం.. ఆ వెంటనే అంబులెన్స్ వచ్చి గాయపడిన యువకునికి చికిత్స చేయడం.. లాంటి దృశ్యాలను చూసి ఏం జరిగింది? ఏం జరుగుతుందోన్న ఆందోళన స్థానికుల్లో నెలకొంది. చివరకు పోలీసులు నిర్వహించిన 'మాబ్ ఆపరేషన్' మాక్ డ్రిల్ అని తెలుసుకుని అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక చర్యలు చోటు చేసుకున్నా.. అల్లర్లు చేస్తున్న సమయాల్లో ఎలా స్పందించాలి? జన సమూహాలను ఎలా నియంత్రించాలనే అంశాలను పోలీసులు డెమో ప్రదర్శించారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎస్పీ రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికల ప్రక్రియలో ముఖ్యమైన కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం నేరాలకు పాల్పడి కేసులతో జీవితాంతం ఇబ్బందులు పడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు రమేష్ బాబు, హనుమంతనాయక్, చంద్రబాబు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, కేంద్ర పోలీస్ బలగాలు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
PARAMEDICAL
■ ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radiographic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఏనీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజీ ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225 [OA-236]

REAL ESTATE
PLOT FOR SALE
■ ఉచితం...ఉచితం...పరివార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ వారు 3.5 లక్షలు విలువ గల 3 సెంట్ల ప్లాటులో (12 ఎర్రచందనం చెట్లు, 12 శ్రీ గంధం చెట్లు) మొత్తం 24 చెట్లతో కొనండి. మీ భూమి మీకే ఇస్తూ మరియు ప్రతి నెల 3500/- రూపాయలు (100 నెలలు) తిరిగి చెల్లించబడును. ఆదాయం అపరిమితం. సెల్: 9963800314. [L-795733]

SERVICES
BUSINESS OFFER
■ పెట్టుబడి పెట్టగల 7th-PG స్త్రీ/పు మా సంస్థ నిర్వహించు సెల్‌ఫోన్ ద్వారా సర్వే వ్యాపారములో భాగస్వాములుగా చేరి నెలకి అత్యధిక సంపాదన పొందగలరు. ఫోన్: 8179021318 [H-778722]

WANTED
■ AP TS NEWS APPలో పనిచేసేందుకు ఆఫీస్ వర్క్ వర్క్ ఫ్రమ్ హోమ్ ఫీమేల్ టెలికాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్లు మరియు విలేకరులు న్యూస్ యాంకర్స్ కావలెను. సెల్: 99666 76646. [L-800635]
■ SARDS సంస్థ ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలో అమలవుతున్న ఉమ్మడి వనరుల అభివృద్ధి ప్రాజెక్ట్‌లో పనిచేయుటకు B.Tech(Civil)/P.G. అర్హత మరియు APDMP, COMMONS, Watershedలో అనుభవం కలిగిన స్థానిక అభ్యర్థులు కావలెను. బయోడేటాను 29లోపల Mail ID: sards2023@gmail.comకు పంపండి. [L-440]
■ Wanted Qualified and well Experienced Teachers To Teach all subjects for Pre Primary and higher classes. ST.LOURDES E.M SCHOOL. Kurnool. Cell: 94939 02958. [L-800637]
■ (1) Cold Storage Plant Operators (ITI - Electrical, Exp- 2 Yrs) (2) Fruits & Vegetables - Procurement Field Supervisor @ Fresh Cart Agro (P) Ltd, Kld Road, ATP. (Interview : May: 29) Ph: 8143697965, 9346612228. [A-130]
■ Wanted Male Marketing Vice Principals and incharges Qualification Any Degre, Age Limit: 25 to 45years. Salary: 10,000/- to 20,000/- Location: Kurnool. Contact: 9248733342. [G-5367]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1233988]
■ కర్నూలు జిల్లా లోని ఓర్వకల్లు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ కావలెను. అ॥ 10th Pass, 12hrs duty, S:16000/-, PF, ESI తో పాటు. Age below 45 yrs. Cell : 9390430299, 9440087632. [A-136]
■ కస్టమర్ కేర్ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 8317512135 [HA-153]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165

రూ.19 లక్షల విత్తనాల అమ్మకాలు నిలుపుదల


రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నంద్యాల(అర్బన్): సరైన ధ్రువపత్రాలు లేని పత్తి, మిరపకు సంబంధించిన రూ.19 లక్షలు విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. విత్తన దుకాణాల తనిఖీల్లో భాగంగా సోమవారం అంతర్గత తనిఖీ అధికారుల బృందం ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు విత్తన దుకాణాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అనుమతులు ఉన్న విత్తనాలను మాత్రమే డీలర్లు విక్రయించాలన్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించినట్లు అయితే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. విత్తనం కొనుగోలు చేసిన ప్రతి రైతుకు డీలర్లు రసీదు ఇవ్వాలని, స్టాక్ బోర్డు ప్రతిరోజూ అప్‌డేట్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీరి వెంట నంద్యాల మండల ఏఓ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో విజయనగరం వాసి మృతి


మృతుడు కాశోజీ

శిరివెళ్ల: నంద్యాల – ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై శిరివెళ్ల మెట్ట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన నంబూరి కాశోజీ (76) మృతి చెందాడు. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. మినీ వ్యాన్‌లో కుటుంబీకులతో కలసి తీర్థ యాత్రలు చేస్తున్న కాశోజీ తిరుపతి నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో శిరివెళ్ల మెట్ట వద్ద ఓ హోటల్‌లో అల్పాహారం కోసం వాహనాన్ని నిలిపాడు. మినీ వ్యాన్ దిగి రోడ్డు దాటుతుండగా నంద్యాల నుంచి కడప వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుని తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్య సేవలు పొందుతూ మృతి చెందాడు. మృతునికి ముగ్గురు కుమార్తెలున్నారు. భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక ఆత్మహత్య

మిడుతూరు: వీపనగండ్ల గ్రామంలో సోమవారం ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ జగన్ మోహన్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని తలముడిపి గ్రామానికి చెందిన రామకృష్ణ, మహేశ్వరి దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. కుమార్తె హేమలత (16) పదో తరగతి పూర్తి చేసింది. కుట్టు మిషన్ నేర్చుకునేందుకు నెల రోజుల క్రితం అమ్మమ్మ ఊరు వీపనగండ్లకు పంపించారు. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో హేమలత సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పొలం నుంచి తిరిగి వచ్చిన అమ్మమ్మ పద్మమ్మ గుర్తించి వెంటనే బాలికను కిందకు దించి ఆటోలో నందికొట్కూరు ఆసుపత్రికి తరలించారు. కాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలికకు తరచుగా కడుపు నొప్పి వస్తుండేదని, నొప్పి భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు ఆసుపత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలిక తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.